www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 మార్చి 2025
5
కాకినాడ



యూత్ పార్లమెంట్‌కు శివమణికంఠ

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని కె.ఇ.చిన్నయ్యపాలెం గ్రామ విద్యార్థి కొరుప్రోలు శివమణికంఠ రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025కు ఎంపికయ్యాడు. సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఈ నెల 22న జరిగిన జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 కార్యక్రమంలో అద్భుతమైన ప్రదర్శనతో మణికంఠ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. టాప్ 10 పార్టిసిపెంట్లలో ఒక స్థానాన్ని సంపాదించుకున్నాడు.



మణికంఠను అభినందిస్తున్న నిర్వాహకులు

గంగపుత్రుల గోడు వినేదెవరు..?

- తగ్గుతున్న సంప్రదాయ మత్స్య సంపద
- వేట సాగక పూట గడవక అవస్థలు
- ఏప్రిల్14 నుంచి వేట నిషేధం అమలు
- నేటికీ అందని గత ఏడాది భరోసా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సముద్రంపై చేపల వేట ఆధారంగా జీవిస్తున్న మత్స్యకారుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. వారి జీవన క్రమంలో చేపల వేట ఆధారంగా కుటుంబాలను పోషించుకుంటూ ఉంటారు. అయితే క్రమంగా సాంప్రదాయ చేపల ఉత్పత్తి తగ్గుతోందని, అందువలన జీవనోపాధికి గండి పడుతుందంటూ గంగపుత్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న మత్స్యసంపద

కాకినాడ జిల్లాలో 5 తీర ప్రాంత మండలాలుండగా 58 మత్స్యకార గ్రామాలున్నాయి. దాదాపు 2 లక్షల మంది మత్స్యకారులు కారులు ఉన్నారు. సముద్ర వేట ద్వారా 36 వేల మంది ఉపాధి పొందుతున్నారు. 467 మెకనైజ్డ్ బోట్లు, 3779 మోటారు బోట్లు, 399 సంప్రదాయ బోట్లు ఉన్నాయి. చేపల వేట ద్వారా దాదాపు మత్స్యకారులంతా జీవనోపాధిని పొందుతున్నారు. అయితే తీరం వెంబడి ఏర్పడిన వివిధ పరిశ్రమల కాలుష్యం వలన చేపల ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని, దీనివలన తమ జీవన భృతికి గండి పడుతుందంటూ మత్స్యకారుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వల విసిరితే ఇబ్బడిముబ్బడిగా చేపలు చిక్కేవి. గత కొన్నేళ్లుగా ఆ పరిస్థితి లేదు. కాకినాడ తీర ప్రాంతంలో అనేక పరిశ్రమలు వెలిశాయి. ఇవి నేరుగా పరిశ్రమ వ్యర్థాలను సముద్రంలోకి విడుదల చేస్తుండడంతో చేపల ఉత్పత్తి తగ్గుతుందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

కాకినాడ జిల్లా కెఎస్ఇజెడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేస్తున్నారు. వాటి కార్యకపాల్లో భాగంగా వాటి నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి వదిలేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమళ్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్లను ఏర్పాటు చేశారు. దీంతో మరింత ఉపాధి తగ్గుతుందనేది వారి వాదన. నేపథ్యంలో వేట సక్రమంగా లేకపోవడంతో పూట గడవని పరిస్థితి ఏర్పడిందంటూ చెబుతున్నారు. తమ బతుకులు అగమ్యగోచరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తీరం వెంబడి అనేక చేపలు మృత్యువాత పడి ఒడ్డుకు కొట్టుకు వస్తున్నాయి. రసాయన వ్యర్థాలే దీనికి కారణమని తీరప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



యు.కొత్తపల్లి తీరంలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు (ఫైల్ ఫోటో)

భరోసా కరువు

మరోవైపు ప్రభుత్వం నుంచి పూర్తిగా భరోసా కరువవడంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల కోసం అనేక హామీలు ఇచ్చినప్పటికీ ఒక్కటి కూడా అమలు కాలేదు. పది నెలలు గడుస్తున్నా నేటికీ మత్స్యకార భరోసా ఇవ్వలేదు. రూ.10 వేల నుంచి రూ.20వేలకు పెంచి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలను పక్కన పెట్టింది. వచ్చే నెల 14 నుంచి వేట నిషేధం అమలు కానుంది. దీంతో మరో 45 రోజులు కుటుంబాలను పోషించుకోవడానికి అప్పులు చేయాల్సివస్తుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. చేపల వేట సాగకపోవడం, వేటకెళ్లినా దొరికే అరకొర చేపలు అమ్మగా వచ్చిన దాంతో కుటుంబాలను నెట్టుకు రావడం కష్టంగా ఉందని చెప్తున్నారు. ఇలాంటి సమయంలోనైనా ప్రభుత్వం తమ దుస్థితిని తెలుసుకుని, మత్స్యకార భరోసా నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

గత ఏడాది పరిహారమే ఇంకా అందలేదని ఈ సంవత్సరం పరిహారం ఇస్తారా? లేదా? అనే ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి గత ఏడాది పరిహారం విడుదల చేయటంతో పాటు ఈ ఏడాది వేట నిషేధం అమలు కాలంలోనే పెంచిన పరిహారం ఇవ్వాలని గంగపుత్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జిజిహెచ్ వద్ద ధర్నా చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ఆందోళన


ప్రజాశక్తి - కాకినాడ

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి వద్ద జరిగిన ఆందోళనలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో-కన్వీనర్ పలివెల వీరబాబు, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.సాయి కుమార్ మాట్లాడారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను 2015లో నాటి టిడిపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. హాస్పటల్లో డెలివరీ అయిన బాలింతను అలాగే పసిబిడ్డను క్షేమంగా హాస్పటల్ నుండి ఇంటికి సురక్షితంగా చేర్చడం కోసం ఈ పథకం తీసుకువచ్చారని తెలిపారు. ఈ పథకం తీసుకు రావడం ద్వారా ఈ వాహనాలపై పనిచేయడానికి డ్రైవర్లు కు ఉపాధి లభించిందన్నార. అయితే ఆనాటి నుంచి నేటి వరకు చాలీ చాలని జీతాలు రూ.7,870లతోనే పని చేస్తున్నారన్నారు. ఈ వేతనం తో డ్రైవర్ కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 31తో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ యొక్క టెండర్ విధానం ముగుస్తుందని, కావున నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా ఈ వాహనాలను నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్లను కొన్ని సందర్భాలలో 104 వాహనాలకు డ్రైవర్లుగా కూడా ఉపయోగిస్తున్నారని అన్నారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ వి.మల్లికార్జున్, ట్రెజరర్ బి.చిన్నబాబు, కమిటి సభ్యులు కె.నగేష్, వి.సుకుమార్, పి.శంకర్, జిబిడి.ప్రసాద్, ఎం.రమణ, వై.అప్పలరాజు, పి.రామ్మోహన్, కె.విజయ్‌కుమార్, కె.ప్రసాద్, జి.నరేష్, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిజిహెచ్ జనరల్ సర్జరీ విభాగంలో రొమ్ము కేన్సర్‌పై వర్క్‌షాప్ ఆదివారం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలు వైద్య కళాశాలల విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రొమ్ము సంబంధిత వ్యాధులు, రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సను ప్రత్యక్ష ప్రసారంలో వైద్య విద్యార్థులకు వివరించారు. శస్త్రచికిత్స విభాగం అధిపతి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్శిటీ ఇన్‌ఛార్జ్ విసి డాక్టర్ డిఎస్‌విఎల్.నరసింహం, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ విష్ణువర్ధన, డాక్టర్ విఠల్, డాక్టర్ కె.బాబ్జి, డాక్టర్ పివి.బుద్ధ, డాక్టర్ రవికమల్, డాక్టర్ వెంకటరెడ్డి, హైదరబాద్ అపోలో ఆసుపత్రి కేన్సర్ సర్జన్ డాక్టర్ సౌమ్య, మెడికవర్ హస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రషోబ, కాకినాడ జిజిహెచ్ వైద్యులు డాక్టర్ నరేంద్ర శస్త్ర చికిత్స చేసి వివరించారు. ఈ వర్కషాప్‌లో డాక్టర్ శైలజరాణి, డాక్టర్ శివ రామకృష్ణ, డాక్టర్ మైథిలిదేవి, డాక్టర్ శైలజ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వైద్యులు

30వ రోజుకు ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

డ్రైవర్‌పై అక్రమ సస్పెన్షన్ నిరసిస్తూ ఏలేశ్వరం ఆర్‌టిసి డిపో కార్మికులు చేపట్టిన నిరసన ఆదివారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో కార్మికులు రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు. వారికి మద్దతుగా కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ ప్రతిరోజు భోజన విరామ సమయంలో గేటు ధర్నాలు నిర్వంచే కార్యక్రమంలో భాగంగా ఆదివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. తక్షణమే డ్రైవర్‌పై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కె.త్రిమూర్తులు, యుబిఎం .కుమార్, నేకూరి ప్రకాశరావు, కార్మికులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్‌లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.



నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

'దొమ్మేటి' కృషి మరువలేనిది

ప్రజాశక్తి - కాజులూరు

ప్రముఖ సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి స్వాతంత్రోద్యమంలో కృషి మరువలేనిదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండలంలోని దుగ్గుదుర్రు గ్రామంలో దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామంలో జాతీయోద్ధరణకు దొమ్మేటి వెంకటరెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. చదువు యొక్క ఆవశ్యకతను దూరదృష్టితో ఆలోచించి వయోజన విద్యను ప్రోత్సహించడంతోపాటు, ఎన్నో ప్రాథమిక పాఠశాలలు, గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు నెలకొల్పారని కొనియాడారు. చదువుతోనే సమానత్వం, ఆర్థిక పరిపుష్టి, జ్ఞాన సముపార్జన సాధ్యమని విద్యకు ప్రాధాన్యత ఇచ్చి, ఎన్నో పుస్తకాలు రాశారని అన్నారు. కులాధిక్యత, అంటరానితనం ఎక్కువగా ఉన్న ఆ రోజుల్లో మనుషులంతా సమానమే అనే నినాదంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అన్యం శ్రీరామచంద్ర మూర్తి, నీటి పంపిణీ సంఘం అధ్యక్షులు లకాని కృష్ణచైతన్య, పెంకె విశ్వేశ్వరరావు, కుడుపూడి కొండ, శెట్టిబలిజ సంఘాల పెద్దలు, మహిళలు, పాల్గొన్నారు.

అమరుల పోరాటస్ఫూర్తి ఆదర్శనీయం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని నేతలు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట స్థానిక భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాలం హరిబాబు, చల్లా మహేష్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ 49వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కామరాజు, నరవ సురేష్, బాలం శ్రీనివాస్, టి నాగమణి, కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, తుంపాల శ్రీనివాస్, కరణం ఏడుకొండలు పాల్గొన్నారు. ఎపి రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని నిర్వహించారు. వల్లూరి రాజబాబు, డి.నారాయణమూర్తి మాట్లాడారు. **కాకినాడ** స్థానిక వివేకానంద పార్క్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమం జరిగింది. సిఐటియు నగర కో-కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్, మెడికల్ ట్రిప్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు సి. వెంకట్రావు, కె.నాగజ్యోతి, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ళ పద్మ, సిహెచ్.వేణు, ఎం.నాగలక్ష్మి, టి. దీనదయ, సిహెచ్‌వి.రమణ, జైరాం, సూర్య, మణికంఠ, రాణి, అమృత పాల్గొన్నారు. నగరంలోని కచేరిపేటలోని యుటిఎఫ్ హోంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భగత్‌సింగ్, రాజ్‌గుర్, సుఖదేవ్ వర్ధంతిని నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గ్లర్స్ కన్వీనర్ చిన్ని అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి టి.రాజా పాల్గొని మాట్లాడారు. నాయకులు లోవరాజు, అరుణ్, గోపాల్‌కృష్ణ, జైరాం, వంశి, మణికంఠ, అబ్దుల పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** అల్లూరి సీతారామరాజు కాలనీ, తూరంగిలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు అజయ్‌కుమార్, పట్నాల వేంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అజయ్‌కుమార్, కక్కల లక్ష్మి, పొట్నూరి సత్యవతి, సిహెచ్.విజయ, కంచి దుర్గాప్రసాద్, వెంకీ, అమ్ము, తానవరపు రమ్య, శ్రావణి పాల్గొన్నారు. ఇంద్రపాలెం మార్కెట్ వద్ద పౌర సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు రోహిత్, ఇంద్రపాలెం మాజీ సర్పంచ్ గుత్తుల రామలింగేశ్వరరావు, పెంకే వీరభద్రం, రామ్మోహన్, బాబ్జీ, వాసంశెట్టి చంద్రరావు, పెద్దింశెట్టి రామకృష్ణ, రవికుమార్, జుత్తుగ శ్రీనివాసరావు, కె.వీరాబాబు, రాజా, విజయ్‌కుమార్, ఉదయభాస్కర్, రమణ, శ్రీను, త్రిమూర్తులు, శివ, జగత్ పాల్గొన్నారు. అలాగే వలసపాకల, సుందరయ్య కాలనీ, సిఐటియు కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.రాజా, తిరుమలశెట్టి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, అంబటి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటరమణ, డి సత్యనారాయణ, బలరాం, సంగీతరావు, రాంబాబు, శ్రీహరి, శ్రీను, సురేష్, దుర్గాప్రసాద్, నూకరాజు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణంలోని జగనన్న కాలనీలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. కుంచె అంజిబాబు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొర్ల శివ, వేగిశెట్టి గణేష్, బల్ల సోమరాజు, కేశవరపు రాజు, కె.శ్రీధర్ పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక చిల్డ్రన్స్ క్లబ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక నువ్వుల గుంట వీధి సెంటర్లోని భగత్ సింగ్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. రొంగల అరుణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు, బుద్ధా శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, డి సత్యనారాయణ, మణికంఠ, యోగేష్, సూర్య కళ, తైనాల శ్రీను పాల్గొన్నారు. అలాగే ఎపి రైతు కూలీ సంఘం, భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పులిమేరులో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, పోశయ్య, వల్లూరి రాజబాబు, డి.నారాయణమూర్తి, బొచ్చ ఏసు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక లారీ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు నాయకులు పిల్ల రాంబాబు, దెంగేటి వేణుబాబు, కడలి సత్యనారాయణ, కూసి వసంతకుమార్, దొండపాటి నాగేశ్వరరావు, గంగిరెడ్ల సత్తిబాబు, పెనగాడ నూకరాజు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద కె.చిన్న, కోనేటి రాజు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, వీరబాబు, కె.మణి, రాజ్యలక్ష్మి, సూర్యనారాయణ, నాగు, తులసి, శ్రీను పాల్గొన్నారు. **తాళ్ళరేవు** ప్రజా సంఘాల కార్యాలయంలో కమిడి ఈశ్వరీబాయి అధ్యక్షతన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు టి.ఈశ్వరరావు, వి. కరిమల స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వల్లు రాజబాబు, బొంతు మోహన్, కొల్లు కృష్ణప్రసాద్, గంటా దిలీప్‌కుమార్, రేకాడి మధువర్మ, మల్లేష్, వాసు పాల్గొన్నారు.



సామర్లకోటలో రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి



కాకినాడలో భగత్‌సింగ్ చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకుల నివాళి




తాళ్లరేవులో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



కాకినాడ రూరల్‌లో నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

కార్టూ'నిజం'



ఉత్కంఠ భరితంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట- ఉండూరు రైల్వే గేట్ వద్ద ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్లో ఆదివారం కీర్తిశేషులు వల్లూరి సత్యంద్రకుమార్ స్మారక రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పోటీలను మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం, టిడిపి నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సీనియర్స్ భాగంలో 12 ఎడ్ల జతలు, జూనియర్స్ విభాగంలో 31 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో ప్రథమ, తృతీయ స్థానాలను గుమ్మిలేరుకు చెందిన కోరా శ్రుతిచౌదరి ఎడ్లు, ద్వితీయ స్థానాన్ని అనకాపల్లికి చెందిన పరవన్నాయుడు ఎడ్లు గెలుపొందాయి. అలాగే జూనియర్స్ విభాగంలో ప్రథమ, 5వ స్థానాలను సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్రకుమార్ ఎడ్లు, ద్వితీయ స్థానాన్ని వడిసలేరుకు చెందిన ధరణి శ్రీనివాస్ ఎడ్లు, తృతీయ స్థానాన్ని గాణాలకు చెందిన మద్దాల శ్రీను ఎడ్లు, 4వ స్థానాన్ని వెల్దుర్తికి చెందిన మొగిలి ఏసుబాబు ఎడ్లు గెలుపొందాయి. అనంతరం విజేతలకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్‌లు యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, గోలి వెంకటఅప్పారావుచౌదరి, భీమేశ్వరాలయం ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్‌కుమార్, కొండపల్లి శ్రీనివాస్, నిర్వాహకులు బిక్కిన రంగ, వల్లూరి దొరబాబు పాల్గొన్నారు.



పందెంలో పరుగులు తీస్తున్న ఎడ్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సత్యవతి

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో వేసవి నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ఎంపిపి పెంకే సత్యవతి అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవి సందర్భంగా మెట్ట గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిడిఒ డి.శ్రీలలిత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మంచినీటి బోర్లు, స్పాట్ డెలివరీ ట్యాంకులు, మంచినీటి సరఫరా పైపులైన్లు ప్రతి గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది పరిశీలన జరిపించి నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గ్రామ పరిధిలో రెవెన్యూ సంబంధిత సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి జరుగుతుందన్నారు. డిప్యూటీ డిఇఒ ఈరంకి ప్రభాకరశర్మ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను, ఉపాధ్యాయుల వివరాలు ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యు కొత్తపల్లి

అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స చేయించుకున్న బాధితులకు ఆదివారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అమీనాబాద్‌కు చెందిన సికోటి స్రవంతి కుటుంబానికి రూ.40,650, సూరాడ కామేశ్వరరావుకి రూ.15,343 రూపాయల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సిఎం చంద్రబాబు ఇంటి పెద్ద కొడుకుగా ఆదుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, సికోటి నానాజీ, సనపయ్య, చోడిపల్లి ప్రసాద్, కోడా జగన్నాథం, బాదిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చెక్కును ఇస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

ఐపిఎల్‌లో కాకినాడ కుర్రాడు

ప్రజాశక్తి - కాకినాడ

క్రికెట్‌లో అత్యంత ఉత్సాహభరితమైన ఐపిఎల్ పండగ ప్రారంభమైంది. మామిడికుదురు మండలం గోగన్న మఠానికి చెందిన పెన్మత్స సత్యనారాయణరాజు ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రస్తుతం కాకినాడ వెంకట్ నగర్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ రాజు ఫాస్ట్ బౌలర్‌గా ముంబై జట్టుకి ఎంపికయ్యాడు. ఐపిఎల్‌లో ఎలా రాణిస్తాడనే ఆసక్తి నెలకొంది.



సత్యనారాయణరాజు

నేరాలు ఘోరాలు



మీడియాతో మాట్లాడుతున్న సిఐ చైతన్యకృష్ణ

చోరీ కేసుల్లో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ సర్కిల్ పరిధిలో పలు చోరీలకు పాల్పడిన నిందుతుడిని అరెస్టు చేసినట్లు సిఐ చైతన్యకృష్ణ తెలిపారు. ఆదివారం తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యు.కొత్తపల్లికి చెందిన బొండపల్లి ఏసుకుమార్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, చిన్నతనంలో తల్లి చనిపోవడం, తండ్రి పర్యవేక్షణ లేకపోవడంతో వ్యసనాలకు బానిసై, బైక్ చోరీలను వృత్తిగా చేసుకున్నాడని తెలిపారు. ఇతనిపై ఉభయగోదావరి జిల్లాలో 10 కేసులు నమోదయ్యాయన్నారు. తిమ్మాపురంలో వాహన తనిఖీలు చేస్తుండగా ముద్దాయిని అదుపులోకి తీసుకుని, 18 బైకులు, బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన రెండు బంగారు ఉంగరాలు, గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి, తిమ్మాపురం ఎస్‌హెచ్ఒ ఆర్.సుస్మిత, ఎస్ఐలు రవీంద్రబాబు, ఆర్‌విఎన్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ భార్యను వేధిస్తున్న భర్త, అత్తమామలు, ఆడపడుచులపై పోలీసులు కేసు నమోదు చేశారు .ఆదివారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉచ్చిలి గ్రామానికి చెందిన తీపర్తి భవానీకి,. పెరవలి మండలం తిపర్రు గ్రామానికి చెందిన తీపర్తి సత్యనారాయణతో 2018 లో వివాహం పెద్దల సమక్షంలో జరిగింది. వీరికి ఒక పాప ఉంది. భర్త పెయింటింగ్ పని చేసుకుని భార్య, పాపను పోషించుకుంటున్నాడు. పెళ్లి సమయంలో రూ.2 లక్షల కట్నం, రూ. 50 వేలు ఆడపడుచు కట్నంఇచ్చారు. ఇటీవల కాలంలో సత్యనారాయణ తాగుడుకు బానిస అయ్యాడు. అదనపు కట్నం తేవాలంటూ భార్యను రోజు వేధించేవాడు. దీనికి తోడు అత్తమామలు ఆడపడుచులు పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆమె ఆదివారం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు పై భర్త అత్త మామ ఆడపడుచులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

బైకు దొంగల అరెస్టు 31 బైకుల స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైకుల చోరీలు పెరిగిన నేపథ్యంలో సిఐ షేక్ బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.శివప్రసాద్, ఆధ్వర్యాన ప్రత్యేక నిఘా పెట్టారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నల్లజర్ల మండలానికి చెందిన ఇద్దరు నిందితులు తూర్ల సోమయ్య, చీర్ల కిషోర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 31 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బైకుల విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని తెలిపారు. బైకులను రికవరీ చేయడంలో ప్రతిభ కనపరిచిన ప్రకాష్ నగర్ సిఐ షేక్ బాజీలాల్, ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్, సిబ్బందిని ఎస్‌పి డి.నరసింహ కిషోర్ అభినందించారు.

దాడి చేసి బైకు అపహరణ

ప్రజాశక్తి - చాగల్లు

మార్కొండపాడు గ్రామ శివారు కుంకుడిమిల్లి గ్రామానికి చెందిన పెద్దింటి రామకృష్ణపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఆయన బైకుతో పరారైన సంఘటన ఆదివారం మీనానగరంలో చోటు చేసుకుంది. తన కోళ్ల ఫారాల నుంచి ఇంటికి వెళు తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తనను గాయపరిచి తన బుల్లెట్ మోటార్ సైకిల్ తీసుకుని పారిపోయినట్టు రామకృష్ణ తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను చాగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - చాగల్లు

మార్కొండపాడు గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 21వ తేదీ నుంచి అదృశ్యమైనట్టు ఆమె తల్లిదండ్రులు ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సీతానగరం

పేకాట స్థావరాలపై సీతానగరం పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.8,400 నగదు, మూడు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

దాడికి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రేష్ డ్రైవింగ్ చేస్తూ ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు ఆదివారం వెల్లడించారు. శనివారం గొల్లప్రోలు బైపాస్ తాటిపర్తి రోడ్డు ప్రాంతంలో రేష్ డ్రైవింగ్ చేస్తున్న వారిని ఆ మార్గంలో వెళ్తున్న తాటిపర్తికి చెందిన మురాళిశెట్టి సూర్యతేజ, పేకేటి ప్రసాద్ ప్రశ్నించారు. అ సమయంలో ఆ వ్యక్తులకు సంబంధించిన మరికొం తమంది వచ్చి సూర్యతేజ, ప్రసాద్‌పై దాడికి దిగారు. ఈ దాడిలో గాయపడిన ఇద్దరిని పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సీతానగరం

ఆదివారం ఉండేశ్వరపురం గ్రామ శివారు తోటల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో సీతానగరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.5 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారమేదీ..?

ప్రజాశక్తి - యానాం

యానాం డంపింగ్ యార్డు సమస్యతో సతమతమవుతోంది. గత కొన్నేళ్లుగా ఈ సమస్య సాగుతోంది. ప్రస్తుతం బంద్ నిర్వహించే వరకూ వచ్చింది. డంపింగ్ యార్డు యానాం - కనకాలపేట రోడ్డులో ఉంది. అయితే రోజూవారీ చెత్తను రీసైక్లింగ్ చేయకపోవడం, చెత్త పెద్ద అనకొండలా మారడం, చెత్తకు నిప్పుపెడుతుండటతో అది నిత్యం దట్టమైన పొగతో మండే కొలిమిలా మారడం వెరసి పరిసర ప్రాంతాల ప్రజల ఆగ్రహానికి కారణం అవుతోంది. డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని నెలలు క్రితం స్థానిక పవర్ గ్రిడ్ వద్ద డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించగా ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తో పాటు పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మద్దతు ఇచ్చారు. దీంతో అధికారులు అప్పటినుంచి ఆ స్థలం విషయంలో మిన్నకుండిపోయారు. ఇటీవల కనకాలపేట, యుకెవినగర్, భీమ్ నగర్ ప్రజలు ఆందోళన నిర్వహించి డంపింగ్ యార్డులో చెత్త వేయకుండా అడ్డుకున్నారు. దీంతో పట్టణ, గ్రామ ప్రాంతాల్లో కొన్ని రోజులపాటు ఎక్కడిచెత్త అక్కడే భారీగా నిలిచిపోవడంతో వీధులు మురికి కూపాలుగా మారాయి. ఈనెల 21న బంద్ నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది లేనిచోట డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని ఎంఎల్ఎ డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కూడా ప్రభుత్వాన్ని కోరారు. లెఫ్టినెంట్ గవర్నర్, సంబంధిత శాఖ డైరెక్టర్‌కు సమస్య తీవ్రతను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. బంద్ నేపథ్యంలో స్థానిక అధికారులు చేసేది ఏమిలేక హడావడిగా గతంలో డంపింగ్ యార్డుకు నిర్ణయించిన స్థలంలో పోలీసు బందోబస్తు మధ్య చెత్తను డంపింగ్ చేశారు. దీన్ని గోపాల్‌నగర్ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. ఇక్కడ చెత్త కొన్ని రోజులు మాత్రమే వేస్తామని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు ఆందోళన కొనసాగిస్తున్నారు. సమస్య జటిలంగా మారడంతో స్థానిక అధికారులు చేతులెత్తేశారు. డంపింగ్ యార్డు అంశంపై ప్రభుత్వం మొదటి నుంచి ఉదాసీనంగానే వ్యవహరిస్తోంది.



ప్రస్తుతం కనకాలపేట డంపింగ్ యార్డ్

శాశ్వత పరిష్కారం చూపాలి



యానాంలో చెత్త సమస్య తీవ్రంగా ఉంది. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. కొన్ని సంవత్సరాలుగా డంపింగ్ యార్డ్‌తో కనకాల పేట, భీమ్ నగర్, యుకెవి నగర్ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాము. డంపింగ్ యార్డ్ విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలి.

- కోన చిన సత్తియ్య, కనకాలపేట నివాసి

డంపింగ్ యార్డ్ పెడితే ఊరుకోం



జనవాసాలు, స్కూల్స్, విద్యాలయాలు ఉన్నచోట డంపింగ్ యార్డ్ పెట్టడం సరికాదు. చెత్త వేస్తే ట్రాక్టర్లను అడ్డుకుంటాము. ప్రభుత్వం మొండి వైఖరి మార్చుకోకపోతే ఆందోళన విరమించేది లేదు. జనవాసాలు లేని ప్రాంతాలకు తరలించాలి.

- ఆరిశెట్టి రాజేష్ గోపాల్ నగర్ నివాసి

వర్గీకరణపై పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు అంతా పోరాటానికి సిద్ధం కావాలని మాల సంఘాల జెఎసి ఛైర్మన్ పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చెలికాని భావనరావు సభా సదన్‌లో ఎస్‌సి వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని నిరసిస్తూ మాల సంఘాల జెఎసి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాలలను అనగదొక్కే విధంగా ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర సరైన సమాచారం లేకుండా 2011 జనాభా ప్రకారం వర్గీకరణ చేయడం చూస్తుంటే కేవలం ఇది చంద్రబాబు సర్కారు మాలలను అణచివేసే కుట్ర అని అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చెబ్రోలులో స్థానిక శాసనసభ్యులు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేయాలని సమావేశంలో తీర్మానించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ చేరుకొని నాయకులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా తమ సమస్యపై డిప్యూటీ సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం కార్యాలయంలో ఎవరు అందుబాటులో లేరని తెలపడంతో ఆ కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జెఎసి నాయకులు మారెళ్ళ సోమరాజు, బత్తిన శామ్యూల్, లింగం శివప్రసాద్, బంగా సతీష్, ఖండవల్లి లోవరాజు, కొంగు నూకరాజు, వేళంగి వెంకటేష్, మహేంద్రాడ సింహాచలం, పెదపాటి రాజేష్, ఉలవల భూషణం, తదితరులు పాల్గొన్నారు.



మాల జెఎసి నాయకులను అడ్డుకున్న పోలీసులు

ముగిసిన లయన్స్ క్లబ్ జిల్లా కన్వెన్షన్

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం కళ్యాణ మండపంలో 2 రోజులుగా జరిగిన లయన్స్ క్లబ్ జిల్లా యాన్యువల్ కన్వెన్షన్ ఆదివారం ముగిసింది. జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన 2వ రోజు కార్యక్రమంలో భాగంగా పలు విభాగాల యాన్యువల్ బడ్జెట్ ఆడిట్ నివేదికలను ప్రవేశపెట్టారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు కృష్ణకుమార్, శ్రావణి దంపతులు, ఉమ, రాజేశ్వరి చేసిన నృత్యాలు, పాడిన గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధులు మంగాదేవి, వజ్రపు కోటేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాసరావు, పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు, దాసరి తిరుమలరావు, నడింపల్లి వినోద్, బిళ్ళకుర్తి శ్రీనివాస్ రెడ్డి, ధూలిపూడి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న క్లబ్ సభ్యులు

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో ఆదివారం గోకవరంలోని విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ 6, 7, 8 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సారేపల్లి దుర్గాప్రసాద్, ప్రయోగశాల సహాయకురాలు కె.సునీత పాల్గొన్నారు.



ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపిపి నాయుడు సునీత అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ బడ్జెట్ సమావేశంలో ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు తాగునీరు, సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించాలని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన పాలకవర్గం శిలాఫలకాన్ని ఎంపిపి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సత్యనారాయణ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

రైతుల కోసం పోరాడుదాం

ప్రజాశక్తి - గండేపల్లి

పార్టీలకతీతంగా రైతుల కోసం పోరాడుదామని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్లూరు పుష్కర లిఫ్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ద్వారా 37,028 ఎకరాల భూమిలో రైతులు పంట సాగు చేస్తున్నారని, లిఫ్ట్ మరమ్మతుల గురవుతూ పూర్తిస్థాయిలో నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అసెంబ్లీలో లిఫ్ట్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరడం జరిగిందన్నారు. ఆయనకు మద్దతుగా పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వత్సవాయి సత్యనారాయణరాజు, డాక్టర్ నక్క సత్యనారాయణ, నేదూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ట్రెజరీ కాలనీ పార్కులోఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రెజరీ కాలనీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.రాజా రాంజీ ఆధ్వర్యంలో పి.సత్యనారాయణ, పండు, వై.సత్యనారాయణ, టెంట్ హౌస్ సురేష్, కాలనీ సెక్రటరీ జి. రాజేష్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దిలీప్ విజన్, పార్థ డెంటల్ వైద్యులు, సిబ్బంది సేవలందించారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు మాజీ కార్పొరేటర్ జెడి.పవన్, నాయకులు పిడకా శేషు, నవీన్, గోవిందరాజులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



వెంకటలక్ష్మి

మండల పరిధిలో 2019 అక్టోబర్ 15 వ తేదీ నాటికి ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది కలగని ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకుని నివసిస్తున్న లబ్ధిదారులు తమ ఇంటి స్థలం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు లబ్ధిదారుల ఆక్రమణంలో ఉన్న స్థలాలను మాత్రమే క్రమబద్ధీకరిస్తారన్నారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారు మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. లేఅవుట్లు, కాలువలు, నదుల గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్, జల వనరులకు సంబంధించిన స్థలాలలో ఆక్రమణ స్థలాలు క్రమబద్ధీకరణ జరగదన్నారు. గతంలో ప్రభుత్వ స్థలం పట్టా పొందిన లబ్ధిదారులు క్రమబద్ధీకరణకు అనర్హులన్నారు. క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, భూమి స్థితిగతులు అధికారులు పరిశీలిస్తారన్నారు.

అందుబాటులో మార్కెట్ భూమికి పత్రాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెంలో మార్కెట్‌కి ఇచ్చిన భూమికి పత్రాలు అందుబాటులోనే ఉన్నాయని సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది రాజకీయంగా తనను ఎదుర్కోలేక దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఆ భూమి కుమ్మర్ల మాన్యం 120 సెంట్లు వందల సంవత్సరముల నుంచి కుమ్మర్లు అనుభవిస్తుండగా 1988 సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన తహశీల్దార్ రైతు వారి పట్టాలు ఇచ్చారని తెలిపారు. వాటి ద్వారా పాస్‌బుక్‌లు పొంది పన్నులు చెల్లిస్తున్నామన్నారు. అందులో కొందరు అమ్మకాలు కూడా చేశారన్నారు.

నేడు పి- 4 సర్వేపై గ్రామసభలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో నిర్వహించిన పి-4 సర్వేపై సోమవారం గ్రామసభలు నిర్వహించబడతాయని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. సచివాలయాల పరిధిలో నిర్వహించిన పి - 4 సర్వే ద్వారా గుర్తించిన 20 శాతం పేద కుటుంబాల వారి జాబితాను గ్రామసభలో ప్రదర్శిస్తారని చెప్పారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని సూచించారు.

అనూస్ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన అనూస్ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ వేసవి కాలంలో ర్యాలి సందర్శకులు, బాటసారుల దాహార్తి తీర్చడానికి స్థానిక అనూస్ హోమ్ వద్ద చలివేంద్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, సౌభాగ్య గ్రూప్స్ అధినేత చిన్నం చంద్రారెడ్డి ప్రారంభించారు. తొలి రోజున చింతా లావణ్య కుమార్ సౌజన్యంతో పుచ్చకాయ జ్యూస్, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనూస్ సభ్యులు శ్యామ్ జాదుగర్, అన్నపూర్ణ, తేజశ్రీ, మోహిత్, సీతలు పాల్గొన్నారు.

బిసి కులగణన చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

దేశవ్యాప్తంగా బిసి కులగణన చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. కులగణనకు ఆధారంగా బిసిల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడీ సహకరించాలని ఆయన అన్నారు. ఆదివారం అమలాపురం ప్రెస్ క్లబ్ లో వెంగళరావు యాదవ్ అధ్యక్షతన జాతీయ బిసి సంక్షేమ సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. సుప్రీం కోర్టు, హైకోర్టులలో జడ్జిలా నియామకంలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని ావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా మట్ట రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులు గా కైల శోభన్ బాబు, కందుల విజయకుమార్, జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా రాయుడు సత్యరుష్, అధ్యక్షులుగా కాటాడి ఉమా మహేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరశిఖ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా పావులూరి శివరామకృష్ణ, సూరిబోయిన సుబ్రహ్మణ్యం, ట్రెజరర్, అధికార ప్రతినిధిగా కానుబోయిన దుర్గాప్రసాద్, ఎన్నుకున్నారు.

యానాం వార్తలు



విద్యుత్ సబ్‌స్టేషన్ డంపింగ్ యార్డ్ వద్ద మాట్లాడుతున్న గ్రామస్తులు

బలవంతంగా చెత్త వేయడం దారుణం

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు గోపాల్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద డంపింగ్ యార్డ్‌లో బలవంతంగా చెత్తను వేయడం దారుణమని కాలనీవాసులు అన్నారు. యార్డు వద్ద జరుగుతున్న ఆందోళన ఆదివారం నాటికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా పోలీసులు బెదిరింపులు మధ్య చెత్తను వేస్తున్నారని ఆరోపించారు. పుదుచ్చేరి ప్రభుత్వం, అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ పెడితే ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దుర్వాసన కొడుతుందన్నారు. ఎవరూ లేని సమయంలో చెత్తను డంప్ చేయడం సరికాదన్నారు. తక్షణమే చెత్తను వేయకుండా ఆపాలన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు స్పందించాలన్నారు.



పోలీసులను సత్కరిస్తున్న సిఐ షణ్ముగం,

పోలీసులకు సత్కారం

ప్రజాశక్తి - యానాం

దొంగతనం కేసులో సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న కనకాల వెంకటేశ్వర్లు తప్పించుకుని పారిపోయి కొద్ది గంటల వ్యవధిలోనే అతనని అరెస్టు చేసిన క్రైం పోలీసులు పబ్బినీడి ఏసుబాబు, మల్లాడి గణేష్, దేవరపల్లి సురేష్‌లను సిఐ షణ్ముగం ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సిఐ గూటం శివగణేష్, తోటి పోలీసులు పాల్గొన్నారు.



తొండంగిలో పరీక్షలు రాస్తున్న వయోజనులు

పరీక్షలు రాసిన వయోజనులు

ప్రజాశక్తి - తొండంగి, తాళ్లరేవు

తొండంగి మండలంలోని 800 మంది వయోజనులు ఉల్లాస్ కార్యక్రమంలో పరీక్షలు రాశారు. ఆదివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన పరీక్షలకు పెద్దఎత్తున వయోజనులు పాల్గొన్నారు. అడల్ట్ ఎడ్యుకేషన్ ద్వారా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా విఓఎలు 800 మంది వయోజనులకు చదవడం, రాయడం, గణితం అంశాలతో కూడిన విద్యను ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వయోజనులు పరీక్షలు రాశారని ఎపిఎం సత్తిబాబు తెలిపారు. అలాగే తాళ్లరేవులో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని గత 3 నెలలుగా విఓఎలు మండలంలో 738 మంది నిరక్షరాశ్యులకు అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తికావడంతో ఆదివారం పరీక్షలు నిర్వహించినట్లు ఎపిఎం విష్ణుమూర్తి తెలిపారు. కోరంగి పంచాయితీ సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పరీక్షలను నిర్వహించారు..



డాక్టరేట్‌ను అందుకుంటున్న బాలకృష్ణ

తోట బాలకృష్ణకు డాక్టరేట్

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నం జమునానగర్ నివాసి తోలుబొమ్మలాట కళాకారుడు తోట బాలకృష్ణకు అరుదైన డాక్టరేట్ పురస్కారం లభించింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు ఇతర ప్రముఖుల చేతులు మీదుగా ఆదివారం తోలు బొమ్మలాట కళాకారుడు తోట బాలకృష్ణని పుదుచ్చేరిలో ఘనంగా డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తోలుబొమ్మలాట కళాకారుడు తోట బాలకృష్ణ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ తన ప్రతిభ ను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసి, సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం దాతల సాయంతో యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, వేద పండితులు అవధాని, శంకర్, ఆసాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.